ఏజెన్సీని వణికిస్తున్న చలి

- పసి పిల్లలు, వృద్ధులకు మొదలైన తిప్పలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



దుమ్ముగూడెం: ఏజెన్సీలో చలి చంపేస్తోంది. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో ఉదయం నుంచి రాత్రి వరకు చల్లటి గాలులు వీస్తున్నాయి. పగటి పూట ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయి చలి తీవ్రత పెరుగుతోంది. చలి తీవ్రం కావడంతో పిల్లలు, వృద్ధులు, అస్తమా ఉన్న వారు ఇబ్బందులకు గురవుతున్నారు. అలర్జీ, ఆస్తమా, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, బీపీ, గుండె సంబంధిత వ్యాధులు ఉన్న వారు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. చలి నుంచి ఉపశమనం పొందేందుకు ఉన్ని దుస్తులను వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. మధ్యాహ్నం వరకు చలి గాలులు వీస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

తప్పని పనులు..

తెల్లవారుజామునే పాలు, కూరగాయలు విక్రయించే వారు రక్షణ కవచాలు ధరించినప్పటికీ వణుకుతూనే గ్రామాలకు వస్తున్నారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ పాలు సరఫరా చేస్తున్నారు. కూరగాయాలు,ఆకు కూరలు విక్రయిస్తున్నారు. ఉదయం పూట పనులు చూసే పారిశుద్ధ్య కార్మికులు చలితో ఇబ్బంది పడుతూ గ్రామాలను శుభ్రం చేస్తున్నారు. చలి ఉన్నా తమ పనులు చేసుకోవాల్సిందేనని వారు పేర్కొంటున్నారు. చలి కారణంతో దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు ఇబ్బంది పడుతూ ఆస్పత్రులకు వెళ్తున్నారు.

విద్యార్థులు, ఉద్యోగులు, కూలీల అవస్థలు..

చలి ఉన్నా విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు, ఉద్యోగులు విధులకు హాజరు కావాల్సిందే. చలి పంజా విసురుతుండటంతో ఉదయాన్నే పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు, విధులకు వెళ్తున్న ఉద్యోగులకు అవస్థలు తప్పడం లేదు. రెక్కాడితేగానీ డొక్కాడని నిరుపేదలు కూడా చలికి వణుకుతూనే కూలి పనులకు వెళ్తున్నారు. వరి, పత్తి పంటలు కోతకు రావడంతో కూలీలు చలిలోనే వణుకుతూ పనులకు వెళ్తున్నారు.

జాగ్రత్తలు తీసుకుంటే మేలు..

అలర్జీ, ఆస్తమా, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, బీపీ, గుండె సంబంధిత రోగులు జాగ్రత్తలు తీసుకోవాలి. నిత్యం వ్యాయామం చేయాలి. చిన్నారులకు చలిగాలి తగలకుండా చర్యలు తీసుకోవాలి. ఎండ వచ్చిన తర్వాతే బయటకు రావాలి. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే చలిగాలి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదయం 8 గంటలకు ముందు, సాయంత్రం 6 గంటల తర్వాత దూర ప్రయాణాలను రద్దు చేసుకుంటేనే మేలు.

జాగ్రత్తగా ఉండాలి..



ప్రజలు బయటకు వచ్చే సమయంలో టోపీ, కండువా, చేతి తొడుగుల, ఇన్సులేటెడ్ గ్లోవ్స్ ధరించండి. చాలా చల్లగా ఉన్నప్పుడు, వీలైనంత ఎక్కువ చర్మాన్ని కవర్ చేయండి. రోజుకు 3–4 లీటర్ల నీరు తాగాలి. చిన్న పిల్లలు, గర్భిణులు, వృద్ధులు బయటికి అవసరం అయితేనే రావాలి. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహ నాలపై ప్రయాణించవద్దు. రాత్రి సమయాల్లో డ్రైవింగ్ చేయకపోవడమే మేలు.

– డాక్టర్ పుల్లారెడ్డి,
దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

చిరుజల్లులతో అన్నదాతల హైరానా

చంద్రుగొండ/అన్నపురెడ్డిపల్లి: తుఫాను ప్రభావంతో రెండురోజులుగా కురుస్తున్న చిరుజల్లులు అన్నదాతల గుండెల్లో హడలు పుట్టిస్తున్నాయి. చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో ఈ ఏడాది సుమారు 10 వేల ఎకరాల్లో వరి సేద్యం చేశారు. ప్రస్తుతం 40 శాతం వరకు వరికోతలు పూర్తి అయ్యాయని చెప్పొచ్చు. కోసిన ధాన్యం ఇంకా కల్లాల్లోనే ఉన్నాయి. చిరుజల్లులతో తడుస్తున్న రాసులను రక్షించుకునేందుకు పరదాల కోసం అన్నదాతలు పరుగులు పెడుతున్నారు. ఆరుగాలం శ్రమించి, వేలాది రూపాయల పెట్టుబడులు వెచ్చించి సేద్యం చేసిన పంట చేతకందే దశలో అకాల వర్షాలు అన్నదాతలకు శాపంగా పరిణమించాయి. చీడపీడలు, తెగుళ్లబారి నుంచి రక్షించుకున్న పంట వర్షార్పణం అవుతూ రైతులు ఆర్థిక నష్టాల పాలౌతున్నారు. గడిచిన ఏడాది కూడా డిసెంబర్ నెలలో తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలు రైతులను ఆర్థికంగా నష్టాలు చేశాయి.



చంద్రుగొండ: చిరుజల్లుల కారణంగా ధాన్యం రాసులపై పట్టాలు కప్పుకున్న రైతులు

గుండాల: రెండు రోజులుగా మబ్బులు కమ్ముతూ చిరుజల్లులతో మొదలైన వాన ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. గుండాల ఆళ్ళపల్లి మండలాల్లో ఆదివారం సాయంత్రం నుంచి గంట రెండు గంటలపాటు వర్షం కురిసింది. దీంతో ఆరబోసిన మొక్కజొన్న, వరి ధాన్యం తడిసి ముద్దయ్యాయి. కోతలకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న, వరి చేన్లు నేలరాలాయి. ఈ అకాల వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూలీల కొరతతో చేతికి అందిన పంట చేన్లు అకాల వర్షంతో దెబ్బ తినడంతో రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని వేడుకుంటున్నారు.

రైతుల రాస్తారోకో..

అశ్వారావుపేట: పెదవాగు ప్రాజెక్టు శిఖం భూముల్లో అక్రమంగా జరుగుతున్న సాగును అడ్డుకోవాలని ఆయకట్టు రైతులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. గుమ్మడవల్లి గ్రామంలో రైతులు రహదారిపై బైఠాయించిన రాస్తారోకో నిర్వహించారు. కొద్దిసేపటి వరకు అశ్వారావుపేట, వేలేరుపాడు మార్గం స్తంభించింది. జూలై 18న పెదవాగు ప్రాజెక్టు కోతకు గురికావడంతో ప్రాజెక్టులో నీళ్లు లేక ఖాళీ అయింది. దీన్ని అవకాశంగా తీసుకున్న ఆంధ్రా ప్రాంతానికి చెందిన కొందరు రైతులు అక్రమంగా పొగాకు సాగును చేపట్టారు. ఈ విషయాన్ని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు గతంలో రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు.



ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

సౌకర్యాలు మెరుగుపరచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

దుమ్ముగూడెం: ప్రభుత్వం వసతి గృహాల్లో చదువుతున్న పేద విద్యార్థుల విషయంలో వివక్ష చూపుతోందని, కలుషిత ఆహారం, నీరు వల్ల విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ బృందం మండలంలోని ఏకలవ్య మోడల్ స్కూల్, గురుకుల ఆశ్రమ బాలికల పాఠశాలలను పరిశీలించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యమంత్రి లేక విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజన సదుపాయాలు అందడం లేదని అన్నారు. పరిసరాల పరిశుభ్రత లోపించాయని, ఆహారం విషపూరితం అయ్యి విద్యార్థుల ప్రాణాల మీదికి వస్తున్నా పట్టించుకునే స్థితిలో ప్రభుత్వం లేదని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ నాయకుడు మానే రామకృష్ణ, మండల కన్వీనర్ కణితి రాముడు, కో కన్వీనర్ ఎండి జానీ పాషా, నాయకులు కోతూరు సీతారామారావు, బొల్లి వెంకట్రావు, కాల్వ పూర్ణయ్య, దామెర్ల శ్రీనివాస్, కొత్త మల్లేశ్వరరావు, లంకా శివ, మడకం భూపతి రావు, జంజూరి జయసింహ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం విద్యుత్ ఫీడర్‌లోని గ్రామాలలో నేడు ఉదయం 8గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్ కో ఏఈ మోహన్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నర్సాపురం విద్యుత్ ఫీడర్‌లో చెట్టు కొమ్మలు తొలగించే కార్యక్రమం చేపడుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆలయాలను సందర్శించిన జడ్జి దంపతులు

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాలను జిల్లా ఆరవ, సత్తుపల్లి కోర్టు న్యాయమూర్తి ఎం.శ్రీనివాసరావు దంపతులు ఆదివారం సందర్శించారు. ఆలయాల్లో స్వామి వార్ల సన్నిధిలో పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఆలయాల విశిష్టతను ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆలయాల ఈఓ పీవీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం కార్తీక మాసం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరుట్ల రాజగోపాల్ చార్యులు అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారికి విశేషాలంకరణ చేసి పూజలు చేపట్టారు.అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలను నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

సంక్షేమ బోర్డును కాపాడుకునేందుకు ఉద్యమించాలి

బూర్గంపాడు: కార్మికుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డును కాపాడుకునేందుకు ఉద్యమించాలని ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వేల్పుల మల్లికార్జున్ పిలుపునిచ్చారు. ఆదివారం సారపాకలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డును ప్రైవేటు బడా బహుళ జాతి కార్పొరేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ ప్రక్రియతో ధారాదత్తం చేసేందుకు ప్రయత్నాలు సాగిస్తోందన్నారు. ఈ ప్రయత్నాలు కార్మికులు ఐక్యంగా తిప్పికొట్టి సంక్షేమ బోర్డును కాపాడుకోవాలన్నారు.ఈ సమావేశంలో యూనియన్ నాయకులు వల్లపాక వెంకటేశ్వర్లు, రసూల్, వీరమల్ల శివ, జమీల్, తులసి, రమణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జున్

ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు



ప్రజాపాలన విజయోత్సవాల్లో ఎంఈఓ లక్ష్మి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

దమ్మపేట: మండల కేంద్రం, దమ్మపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజాపాలన విజయోత్సవ వేడుకలను, మండల విద్యాశాఖ అధికారి కీసర లక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాపాలన పోస్టర్లను ఎంఈఓ చేతలమీదుగా ఆవిష్కరించారు. ఈ వేడుకలను పురస్కరించుకుని, పాఠశాలలో 'పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం'అను అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు జి.విజయ, నాసియాలు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించగా, తెలుగు మీడియంలో ప్రకాష్, గౌతమ్‌లు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరికి ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ కీసర లక్ష్మి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

అశ్వాపురం: ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందని ఆ పార్టీ మండల నాయకుడు ఓరుగంటి రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏకకాలంలో 22.5 లక్షల మంది రైతులకు 18వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్ర స్పష్టించిందన్నారు. 2 లక్షలకు పైబడి ఉండి రుణమాఫీ అందని రైతులకు కూడా మిగిలిన 13వేల కోట్ల రూపాయలు త్వరలో మాఫీ అవనుందన్నారు. సన్నధాన్యం పండించిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చి హామీ నిలబెట్టుకున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనే బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుందని భరోసానిచ్చారు.

స్వెట్టర్లు అందజేయాలి

కరకగూడెం: రోజు రోజుకూ చలి తీవ్రత పెరుగుతున్న తరుణంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి వివిధ ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు చలి నుంచి రక్షణగా స్వెట్టర్లు, దుప్పట్లును తక్షణమే పంపిణీ చేయాలని ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రేమ్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. కొన్ని వసతి గృహాల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, మౌలిక వసతుల కల్పనలో అధికార యంత్రాగం విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. వెచ్చని దుస్తులు అందజేసి, తరచూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, లేదంటే తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

సభకు తరలివెళ్లిన మాలలు

మణుగూరురూరల్: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లో జరిగే మాలల సింహగర్జన సభకు మండలం నుంచి సింగరేణి కాలరీస్ ఎస్సీ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు, మాల మహానాడు నేతలు, మాల కులస్తులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. తొలుత అంబేడ్కర్ సెంటర్‌లోని అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి వారు పూలమాల వేసి నివాళ్లర్పించారు. జై భీమ్ అంటూ నినాదాలు చేశారు.

చంద్రుగొండ/అన్నపురెడ్డిపల్లి: హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సింహగర్జన మహాసభకు మాలమహానాడు శ్రేణులు ఆదివారం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. తొలుత స్థానికంగా ర్యాలీలు నిర్వహించారు. డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు శంకర్, రాయి రాజా, తంబళ్ళ మంగయ్య, రుంజా శ్రీను, చల్లా రాంబాబు, పుల్లయ్య, వెంకటేష్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



చంద్రుగొండ: హైదరాబాద్ తరలివెళ్తున్న మాలమహానాడు శ్రేణులు



మణుగూరురూరల్: సింహగర్జనకు తరలివెళ్తున్న మాల సంఘాల నాయకులు

భగవద్గీత కంఠస్థ పోటీల్లో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని ఉమామహేశ్వరి

ములకలపల్లి: జిల్లా స్థాయి భగవద్గీత కంఠస్థ పోటీల్లో ములకలపల్లి విద్యార్థినులు సత్తా చాటారు. కొత్తగూడెంలో ఆదివారం నిర్వహించిన జిల్లా పోటీలో చక్కటి ప్రతిభ చూపి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఒకటో విభాగంలో శిశుమందిర్ విద్యార్థిని మేకా పద్మప్రణీత (రెండో తరగతి) ద్వితీయ బహుమతి, మూడో విభాగంలో జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని వేముల ఉమామహేశ్వరి (ఏడో తరగతి) తృతీయ బహుమతి కైవసం చేసుకున్నారు. విజేతలకు రాష్ట్ర అర్చక పురోహితులు ఓరుగంటి సురేశ్ చేతుల మీదుగా బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేశారు. జెడ్పీ హైస్కూల్ టీచర్ చంద్రకళ, విశ్వ హిందూ పరిషత్ జిల్లా బాధ్యులు గొడ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అశ్వారావుపేట: అశ్వారావుపేట జీవనశ్రీ ఆస్పత్రి వారి సౌజన్యంతో, మండల పరిధిలోని గాండ్లగూడెం, అనంతారం గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఆదివారం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ పూర్ణచంద్, అనారోగ్య బాధితులకు వైద్య పరీక్షలను నిర్వహించి, సంబంధిత మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో కూడా గ్రామీణా ప్రాంత ప్రజలకు, తమవంతుగా వైద్య సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూక్యా సక్రు, మారోతు ఆలీబాబు, భూక్యా ప్రసాద్, కొనుసోతు నవీన్ తదితరులు పాల్గొన్నారు.



అనారోగ్య బాధితులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణచంద్

గ్రామాల అభివృద్ధిలో సీపీఐ కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు అయోధ్య

మణుగూరురూరల్: పినపాక నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధిలో సీపీఐ ఎనలేని కృషి ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య తెలిపారు. మండల పరిధిలోని సాంబాయిగూడెం గ్రామంలో ఆదివారం జరిగిన గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండల శివారున భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణానికి భూములు అప్పజెప్పేందుకు రైతులను ఒప్పించడంలో, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో సీపీఐ కీలక భూమిక పోషించిందన్నారు. పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి కావస్తున్న సందర్భంగా ఈ నెల 26వ తేదీ నుంచి ఆవిర్భావ ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

అనంతరం 11మంది సభ్యులతో నూతన గ్రామశాఖ కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు పార్టీలో చేరారు. వీరికి అయోధ్య కండువాలు కప్పి సాధరంగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో సీపీఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ కామిశెట్టి రామారావు, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు రమేష్, భీమరాజు కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రహదారి

అశ్వాపురం: మండల పరిధిలోని గిరిజన గ్రామమైన ఎలకలగూడెం గ్రామంలో రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఇటీవల భారీ వర్షాలకు ఇసుకవాగు పొంగి ప్రవహించి వాగు ప్రవాహానికి రహదారి భారీగా కోతకు గురైంది. కోతకు గురై నెలలు గడుస్తున్నా రహదారిని ఎవరూ పట్టించుకోవడం లేదు. కుంగిపోయిన ఈ రహదారిపై ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. ఏ ప్రమాదం జరగకముందే అధికారులు, స్థానిక ఎమ్మెల్యే స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని గిరిజనులు కోరుతున్నారు.



అశ్వాపురం: ఎలకలగూడెంలో ప్రమాదకరంగా ఉన్న రహదారి

మూలమలుపుతో ప్రమాదం..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గోదావరిపై ఇటీవల ప్రారంభించిన బ్రిడ్జి మీదగా భద్రాచలం వస్తున్న క్రమంలో మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. సూచిక బోర్డులు లేకపోవడంతో మూల మలుపు ఎంత ఉందో తెలియక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొటున్నారు. కాగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సారపాక మీదగా భద్రాచలం వచ్చే వాహనదారులకు ఈ మూలమలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. బ్రిడ్జి మీదతో పాటు రోడ్ల వెంట ఉండాల్సిన వీధి దీపాలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డు మార్గం కనిపించక ప్రమాద అవకాశాలు మరింత పెరిగాయి. ఈ మధ్యన రాత్రి ఓ ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు ప్రమాదానికి గురై మృతి చెందారు. ఇప్పటికైనా బ్రిడ్జి పాయింట్ వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని వావాహన దారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీలో మాట్లాడుతున్న వైద్యాధికారి శివకుమార్

మణుగూరురూరల్: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్ మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరిగిపోతోందని, ప్రజలందరూ ఆందోళన చెందుతున్నారని తెలిపారు. నిర్లక్ష్యం, అవగాహన రాహిత్యం వల్లనే ఎయిడ్స్ వ్యాప్తి చెందుతోందన్నారు. ప్రతీ ఒక్కరు ఎయిడ్స్ పట్ల అవగాహన పెంచుకుని ఎయిడ్స్ రహిత సమాజం కోసం పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిశాంత్‌రావు, సూపర్ వైజర్లు స్వర్ణలత, వైద్య సిబ్బంది రాంప్రసాద్, దయామణి, జానకి, ఉమేష్, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గురజాడ సాహిత్య సంస్మరణ సభ



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాచారి

భద్రాచలంటౌన్: భద్రాచలం శాఖా గ్రంథాలయంలో తెలంగాణ సాహితి భద్రాచలం శాఖ ఆధ్వర్యంలో మహాకవి గురజాడ వర్ధంతి సందర్భంగా సాహిత్య సంస్మరణ సభను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు తాతోలు దుర్గా చారి మాట్లాడుతూ.. అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ అని, వాడుక భాషలో ఎన్నో రచనలు చేసి సమాజాన్ని చైతన్యవంతం చేసిన గొప్ప సంఘ సంస్కర్తని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోళ్ళ భూపతి రావు, కవి రాళ్ళబండి బాలాజీ రాజు, గ్రంథాలయ నిర్వాహకులు జానీ, ఏటుకూరి తిరుమలరావు, వాణి, సోంపాక సీత, కుంజా నాగలక్ష్మి, ఎస్ కె.జహీదా బేగం, యం.పద్మావతి, తిరుపతి వెంకటాచలం, కె.దుర్గా ప్రసాద్, జీఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాదికి సన్మానం



న్యాయవాది కృష్ణకుమార్ దంపతులను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది పాపినేని కృష్ణకుమార్ వృత్తిలో 50 వసంతాలు పూర్తి చేసుకోవడంతోపాటు 80వ పుట్టినరోజు ఆదివారం భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా.. కృష్ణకుమార్ పతులను సన్మానించారు. పూల మాలలు వేసి, శాలువాతో సత్కరించి, రాముల వారి ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం మాట్లాడుతూ.. సీనియర్ న్యాయవాది కృష్ణకుమార్ న్యాయవాది వృత్తిలో ఉన్నత విలువలకు కట్టుబడి భవిష్యత్ తరాల న్యాయవాదులకు అదర్శంగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమాన్ని విస్మరిస్తున్న పాలకులు

బూర్గంపాడు: కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు ఆరోపించారు. సారపాకలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం భవన నిర్మాణ కార్మిక సంఘం పెయింటర్ల యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల లేబర్ ఇన్సూరెన్స్‌కు పాలకులు మోకాలడ్డుతున్నారన్నారు. వేలాదిమంది కార్మికుల అప్లికేషన్‌లు ఆన్‌లైన్ చేయకుండా సర్వర్లను నిలిపివేశారని ఆయన ఆరోపించారు. కార్మికుల సంక్షేమం కోసం ఐక్య పోరాటాలను కొనసాగించాలన్నారు. సీఐటీయు మండల కార్యదర్శి అప్పారావు, ఎస్.శ్రీనివాస్, మల్లయ్య, సీహెచ్ రమణయ్య, నూనె వెంకన్న, ముక్కంటి, హనుమ,ప్రేమ్‌చంద్, పెరిక స్వామి, బిచ్చు పాల్గొన్నారు.